# మానవ జీవితం : గొడుగు

"సత్యశ్రీ"

"లక్ష్మీ! అదెక్కడుందంటావు?" అన్నాను దొడ్లో నూతిదగ్గర కిట్టిగాడికి నీళ్లుపోస్తున్న లక్ష్మితో.

"ఏమిటండీ! అది" అంది నావంక ఆశ్చర్యంగా చూస్తూ, లక్ష్మి.

"అదే! "మనపటి పాతగొడుగు!" అన్నాను నేను లక్ష్మి కేసిచూస్తూ.

"అదా! ఏమో! అటకమీదో ఎక్కడో, ఉండాలి! అయినా దానితో ఏంపని మీకు?" అంది లక్ష్మి పిల్లవాడి సబ్బువళ్లు కడుగుతూ.

"ఏంపనా? వర్షాకాలం వచ్చిందా? బయటకు వెళ్ళవలసివస్తే, ఏముంది వేసుకోవటానికి?"

"అయ్యో! యింక అదేంపనికొస్తుందండీ! వూసలూ అవీవంగిపోయి ఉన్నాయి, అదీకాక అటకమీద పడెయ్యటంవల్ల ఎలుకలు గుడ్డను పాడుచేసి ఉండొచ్చు! అదెందుకు, కొత్తది కొనకూడదూ?" అంది కిట్టిగాడి వళ్లుతుడుస్తూ.

"ఏడిసినట్లే ఉంది! కొత్తదెందుకు, ఒకటి ఉండగా! అయినా కొందామన్నా డబ్బేది? మొన్నేగా పెద్దమ్మాయి పురిటికి వచ్చివెళ్లింది ఆ పాతదాన్నే బాగుచేస్తేసరి! అదే బాగుంటుంది."

"మీరు ప్రతిదానికీ యింతేనండీ! అయినా యిప్పుడు గొడుగులు చవకయినయిగా, కొత్తదే కొంటే బాగుంటుందిగా" అంది కొంచెం మూతి ముడిచి.

"అయితేమాత్రం! ఉన్నదానితో తృప్తి చెందాలికాని, ఒకటివుండగా రెండోది ఎందుకు? ఏం? పాతగొడుగు వేసుకుంటే మన్నెవయినా నీచంగా చూస్తారా? గాంధీలాంటి మహాత్ముడే నిరాడంబరంగా జీవించినప్పుడు, యికమనకేమిటి? ఆయన కట్టుకున్న అంగవస్త్రం, ఆయన ఘనతకు లోటు ఏమయినా తెచ్చిందా?" అని, చిన్న బోధనోపన్యాసం యిచ్చాను.

"ఇక మీకెప్పుడూ ఆ గాంధీగారు ఒకరు దొరుకుతారు! అయినా నాకెందుకు! మీఇష్టం" అని, లక్ష్మి కిట్టిగాణ్ణి ఎత్తుకుని రుసరుసమంటూ లోపలకెళ్ళింది.

ఇదంతా నా పిసనారితనంఅనుకుంటుందిలక్ష్మి. అనవసరంగా డబ్బు తగలెయ్యటం అంటే నాకు తలనొప్పి. అయినా, పాతదో, పూరాతదో ఏదో ఒకటి ఉందిగా. అది ఉండగా క్రొత్తది దేనికి? అందులోనూ, నా పంతులుగిరీలోవచ్చే 98 రూపాయిలతో నలుగురు పిల్లలు, వెనుక పెద్ద సంసారం ఎలా గడుస్తుంది చెప్పండి? అందుకని డబ్బు ఖర్చులేకుండా సూక్ష్మంలో దారి వెతుకు తూంటాను. అసంతా నా పిసినారితనమే అను కుంటుంది లక్ష్మి! కాని, నేనుమాత్రం అలా అనుకోను. మహాత్ముడు బారిష్టరుగా ఉన్నప్పుడు అతని క్షవరం అతను చేసుకోవడం పిసనారితనంతోనే అంటారా?

ఏమన్నా అనండి, క్రొత్త గొడుగు మాత్రం కొనదలచుకోలేదు, పాతదాన్నే బాగుచేస్తే నిక్షేపంలా పనిచేస్తుంది. అందుకు దాన్ని అటకమీదనుంచి దించాలి.

గదిలో లెక్కలు చేసుకుంటున్న మా పెద్దబ్బాయి దగ్గరకు వెళ్లాను. "అరేయి బాబూ! అటకమీద మన పాతగొడుగు ఉంది కానీ, కాస్త వెతికియ్యి నాయనా!" అన్నాను లాలనగా, లేకపోతే వాడి లెక్కలు పాడు చేశానని కస్సుమంటాడు.

"వెధవది! యింకా ఆ ముసలి గొడుగెందుకండి! క్రొత్తదీ కొనకూడదూ?" అన్నాడు వాడు,

వెధవాయి! వీడుకూడా అదేమాట! డబ్బు విలువ వాళ్లకేం తెలుస్తుంది?

—"ఏడిశావులే! కొత్తదిలేదు! గిత్తదీలేదు. ఉన్నది చాలులే?" అన్నాను కొంచెం కోపంగానే. వాడేదో నోట్లో గొణుక్కుంటూ లేచాడు.

ఎలా అయితేనేం లాంతరు పెట్టి వెతకించి కిందకు తీయించాను, అది బూజుపట్టి నానా

అసహ్యంగానూ ఉంది, గొడుగును విప్పగానే అందులోనుంచి రెండు ఎలకలు పరుగెత్తాయి! వెధవ ఎలకలు! నిక్షేపంలాంటి గొడుగుగుడ్డ కొరికి వేశాయి! నిజంగా నా చేతికి అవి దొరికాయంటే ముక్కలు చేసేవాణ్ణి. కష్టపడి దానికి ఉన్న బూజు, సాలెపురుగులు, బొద్దింకలు, మొదలయిన వాటిని శుభ్రంగా తీసి, గుడ్డ వూడదీసి ఉతికించి, వూసలు సుత్తితో నేనే సరిచేసుకొన్నాను! గుడ్డకు మాత్రం చిరుగులు దగ్గర నల్లగుడ్డ దొరక్కపోతే, తెల్లదే వేశాను! లేకపోతే కొత్తగుడ్డ కొనాలంటే రెండున్నరదండుగ అని నా ఊహ.

ఎలా అయితేనేం దాన్ని మళ్లీ గొడుగు ఆకారంగా తయారు చేసేను. కొత్తదానికి ఉన్నంత కళలేకపోయినా, మునుపటి కన్నా యిప్పుడు బాగుందనిపించింది. పని చెయ్యటానికి మాత్రం నిక్షేపంలా పనిచేస్తుంది. ఒక్కనీటిబొట్టు కూడా లోనపడదు! నాకు కావలసింది కూడా అంతే!

ఆ గొడుగు వేసుకొనే, బడికే అనండి, బజారుకే అనండి, భయంలేకుండా తిరిగేవాణ్ణి! బజారులో ఎవరయినా స్నేహితులు కలిస్తే "గొడుగులు యిప్పుడు చవకయినాయికదండి!" అని, నిగూఢంగా అనేవారు! "పోనిద్దురూ! పిల్లలుగలవాణ్ని, ఎలా ఉంటే ఏంపోయింది!" అనిమాత్రం అనగలిగేవాణ్ణి. బళ్లో కుర్రవెధవల అల్లరి నా గొడుగు వెనుకనుంచి నా చెవిన పడక పోలేదు! కానివాళ్ల అల్లరులు ఏమన్నా లెక్కలో పెట్టుకోలేదు. నిజంగా నాకు కొత్త గొడుగుకన్నా ఈ గొడుగంటే మహా యిష్టం కూడా.

* * *

నేను బజారుకెళ్లి తిరిగి యింటికొచ్చేసరికి ఎవరో ఒకాయన (పెద్దమనిషి) అరుగుమీద ఉన్న కుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్నారు. నేను వచ్చిన చప్పుడు కనిపెట్టి "ఓహో! మేష్టారూ! మీకోసమే ఎదురు చూస్తున్నా, బజారు కెళ్లినట్లున్నారు!" అన్నారు ఆయన.

"అవునండీ! ఎప్పుడూ రావటం?" అన్నాను నవ్వుతూ.

ఆయన మాకు చాలా దూరపు బంధువు. దూరమయినా, దగ్గరయినా, బంధువే నని చెప్పాలి. ఆయన ఆస్తీ, గీస్తీ కొంచెం ఉన్న రకమే.

ఏదో కాలక్షేపంగా, రాజకీయాలు మొదలయినవి ఏవో మాట్లాడుకొన్నాము. ఆయన మధ్యలో "ఏమండీ! మీరు నాటకాలు అవీ వ్రాస్తూంటారేమిటి?" అన్నాడు, "ఏదోలెండి! అప్పుడప్పుడూ!" అన్నాను ముక్తసరిగా. "అహా! ఏంలేదులెండి, మొన్న మా వూరిలో యెవరో, మీ నాటకం ఒకటి వేశారు. అందుకు అడుగుతున్నాను! ఆ పేరు మీరేనేమోనని?" అన్నాడాయన.

నేను "అవునండీ!" అని వూరుకున్నాను.

అంతలోకే సీత, (మా రెండో అమ్మాయి) నీళ్లు పట్టుకొచ్చి, "భోజనం పెట్టింది నాన్నా!" అంది—మే మిద్దరం లేచాం భోజనానికి.

భోజనానంతరం కొంచెంసేపు మాట్లాడుకొన్నాము. తరువాత ఆయన కుర్చీలోనుంచి లేస్తూ, "వస్తానండి! బండికి టైమ్ కూడా అవొచ్చింది" అన్నాడు.

"అరె! అప్పుడే వెళ్ళిపోతారా? పోనీ రేపు వెళ్లకూడదూ! అదీగాక మబ్బు కూడా బాగా పట్టివుంది, అందులోనూ స్టేషన్ చాలా దూరాన్న ఉంది, మధ్యలో తడిసిపోతారేమో? పోనీ ఇవ్వాళకి వుండి పోగూడదూ!" అన్నాను.

"అబ్బే! వీల్లేదండీ! నాకవతల చాలా పనులున్నాయి, పోనీ మీదగ్గర ఏదయినా గొడుగు వుంటే యివ్వండి! మళ్లీ ఎల్లుండి వచ్చేటప్పుడు తీసుకొస్తాను, లేకపోతే మీరన్నట్టే మధ్యలో తడిసిపోవలసి వస్తుంది" అన్నాడాయన.

చచ్చానురా భగవంతుడా! నేనేదో మర్యాద కోసమని అలా అంటే, ఆయన నా గొడుగే ఇమ్మంటున్నాడు! నాకు ఉన్నది ఆ ఒక్కటే. ఎక్కడకయినా బయటకు వెళ్లాలంటే రెండోది లేదు. పోనీ యిద్దామన్నా, అసలు అది మళ్లా నన్ను చూస్తుందోలేదో అనే భయం ఒకటి. ఛా ఛా ఆటువంటిడబ్బుగల ఆసామీ నా పాత గొడుగు ఎందుకుంచుకుంటాడు. ఏదో పాపం అవసరాన్నిబట్టి అడిగాడు, గానీ వేరే ఉద్దేశ్యం అయివుండదు! అసలు నాదగ్గర గొడుగేలేదంటే? అబ్బే! ఎలా లేదంటాను. దాన్ని బయటే తగిలించి ఉంచానయ్యె. ఇక చచ్చినట్లు యివ్వాలి.

"ఇదిగోనండీ! ఉన్నదికానీ చాలా పాతది." అన్నాను లోపలవిచారంగావున్నా పైకి కనపరచకుండా.

"పోనీలెండి. ఏదయితేనేం పనిచేస్తేచాలు రక్షించారు. వెళ్ళొస్తానండి. ఎల్లుండి వచ్చేటప్పుడు మీ గొడుగుమాట మరచిపోనులెండి!" అని ఆయన గొడుగు విప్పి గుమ్మం దాటాడు. అప్పుడు నాగొడుగు మీకూనాకూ కడసారిచూపులివేనేమో అన్నట్టు చూసింది.

* * *

రోజులు గడిచాయి. వారాలు గడిచాయి. నెలలు గడిచాయి. కాని నా గొడుగు అంతు లేదు. వెధవది అంత ఘరానామనిషికికూడా నా గొడుగే కావలసి వచ్చిందేమో? ఏమనుకుంటే ఏంలాభం! నాకూ దానికీ ఋణం తీరిపోయింది. పోనీ వాళ్ళవూరువెళ్ళి తెచ్చుకుందామా అంటే, రానూపోను చార్జీలు ఆ గొడుగు విలువకు రెండు రెట్లు అవుతవి. ఇక దాన్ని మరచిపోవలసిందే. చచ్చినట్లు కొత్తది కొనాలి.

కొత్త గొడుగు కొనడానికి బజారుకు వెళుతుంటే లక్ష్మి ఎదురుగావచ్చి, "ఏమండీ అంత కష్టపడి అతుకులేసి, బాగుచేసిన గొడుగు ఆయనకు అప్పచెప్పేరుకదా? అంత కష్టపడకపోతే ముందే కొనుక్కుంటే యేంపోయేది?" అంది నవ్వుతూ.

లక్ష్మి తెలివితక్కువకు నవ్వొచ్చింది. "ఆ! అప్పుడేగనుక క్రొత్తదే కొన్నట్లయితే పాతదానికి బదులు కొత్తదానికే ఎసరు పెట్టేవాడు ఆ పెద్దమనిషి" అంటూ, నవ్వుతూ బజారుకెళ్ళాను కొత్త గొడుగుకోసం.

కథానిక

# "ఋణస్య—"

అంగర వెంకటసత్యనారాయణరావు

ప్రతిదినం ఉదయం సాయంత్రం ఆ మార్గాన వచ్చేపోయేవారికి ఒక చెప్పలేని ఆకర్షణ కలిగిస్తూండేది ఆ కుటీరం. "మోరెమకుట పీతాంబరశోభి-గోవర్ధన గిరిధారి" అని, "నాథహరే జగన్నాథహరే" అని, "బాలగోపాల కృష్ణా పరమకళ్యాణ గుణాకరా" అని రోజూ ఒక తరంగం, ఒక అభంగం, ఒకగీతగోవిందం మృదుమధురంగా వినిపిస్తుండేవి. ఆడంబరంలేక భక్తిరస ప్రపూర్ణమై, శ్రవణపేయమైన ఆ మధురగానమే దారిపోయే ప్రతి హృదయాన్ని ఆకర్షించేది.

గడపలో కాలుపెట్టేసరికి ముందు ఒక విశాలమైన చావిడి, చావిడికి మధ్యగా ఒక చిన్నగది ఉండేది. అది పరమపునీతమైన పూజామందిరం.

మధురగీతాలాపనం గావిస్తున్నది దశవర్ష ప్రాయంగల ఒకబంగారు బొమ్మవంటి అమ్మాయి. పండు తమలపాకులావున్న తాత యెదురుగా కూర్చొని ధ్యానతత్పరతలో అచేతనంగా తాళం వేస్తూండేవాడు. లౌకిక విషయాలతో ఆ పూజామందిరానికి ఏమీ ప్రసక్తిలేదు.

ఒక దశకు పూర్వంనుంచి ఆ పూజామందిరానికి అక్కడ ఉనికి ఉన్నట్టు, అందులోనే తాత నివశిస్తూన్నట్టు ఆ ప్రాంతంలో వినికిడి. భౌతిక విషయాలపై కారణాంతరాలచేత విరక్తిచెంది, కేవలం పారలౌకిక చింతానురక్తుడైన తాత పది సంవత్సరాలకు పూర్వం ఒకనాడు అరుణోదయ సమయాన దేవతార్చన నిమిత్తం పుష్పాలు తీసుకొని వస్తూండగా ఒక చోట మాణిక్యంవంటి రెండేళ్ళబిడ్డ గోచరించింది. ఆ బాలికనుచూసేసరికి విస్మృతిపథాన ఏదో తగినలిట్టు తాతకి గుండె జల్లుమన్నది. అవ్యక్తంగా ఆ పిల్లనెత్తుకొన్నాడు ఆనాటి కణ్వమహామునిలా. కాని కొద్ది సంవత్సరాలకు పూర్వమే ప్రాపంచిక విషయాలపై పూర్తిగావిరక్తిచెంది సర్వసంగ పరిత్యాగివలెవున్న తనకి ఏ ఋణానుబంధం ఇంకా తెగకుండా నిలిచి ఉందా అని తాత తనలో తను ఒక్కసారి ఏదో చెప్పలేని బాధపడ్డాడు. దిక్కుమాలిన ఆపిల్లతనకు గోచరించిన ఉత్తరక్షణంలోనే తను ఎత్తుకున్నా, ఆ లిప్తపాటుకాలంలోనే ఒక జీవితకాలంలో